# 7. అపనింద

సంభాషణ తల నొప్పిగా వుంది.

"నేను వెళ్తారా" అని లేచాను.

'ఏం అంత తొందర? మీవాళ్ళు కూడా ఊళ్ళో లేరాయె?' అన్నాడు వాసు.

"చలిగాలి నాకుపడదు. పోయి ఏదన్నా చదువుకోవాలి."

"మొదటివాక్యం నిజం కాని రెండోవాక్యం...అందులో కూడా నిజంవుందేమోలే!"

"నాకేమీ అర్థమవడంలేదు."

"పిల్లి కళ్ళమూసుకొని పాలు తాగుతూంటే మాత్రం తెలియదట్రా?"

"డొంకతిరుగుళ్ళు మానెయ్యరా - చెప్పేదేదో మొహాన చెప్పెయ్యరాదూ!"

"ఏముందిరా! మీ పక్కింటి శాంత ఉన్నంతకాలమూ నీకు చలిబాధ ఏమిట్రా? ఆమె విషయంలో చదవాల్సిందేమన్నా వుంటే నేను పట్టుకుంటే మాత్రం ఆగుతావట్రా? ఆమె చేతనే పాఠాలు చెప్పించు కుంటావేమో?"

ఆ మాటల్ని జీర్ణించుకునేందుకు రెండు నిమిషాలన్నా పట్టివుంటుంది. మౌనాన్ని వాసు, బహుశా అంగీకారంగానే చూచి వుంటాడనుకుంటాను. ఆ మాటల భావాన్ని పూర్తిగా అర్థంచేసుకున్నప్పటికి నాలో ఏభావం రేగిందో సరిగ్గా చెప్పలేను కాని వాసుగాడి మొహం చదును చేద్దామనే దృఢ నిశ్చయమూ, దానికి శక్తి, ఉద్రేకమూ, బలమూ, ఉత్సాహమూ, అన్నీ ఒక్కసారే నన్ను ముందుకు తోసినవి. కాని నా ఇంగితజ్ఞానం, సభ్యతా ప్రపంచంలోని నా బాధ్యత నన్ను ఒక్క ఊపున వెనక్కులాగినవి. వాడికి జవాబు చెప్పే లోపునే వాడు నవ్వుకుంటూ సాగిపోతున్నాడు. ఒకటికి పలు అనుమానాలు నన్ను బాధించసాగినవి. వాణ్ని కేక వేసి ఆపాను.

"నువ్వన్నది తమాషాగానా?" అన్నాను.

"ఇందులో హాస్యానికి తావులేదు. ఊరంతా తెలిసిన రహస్యమే అయినా, నాకు కాస్త ఆలస్యంగా జేరింది. నిజమంటే నిష్ఠూరమేగా!" అన్నాడు వాసు.

వాసుగాణ్నీ, వాడితోపాటు ఒకళ్ళిద్దర్నయితే తన్నేందుకు సన్నాహాలుచేసే వాణ్నే కాని 'ఊరంతా' అనేమాట విని నాకు గుండెలు జారి నట్లయినయ్. సర్వజనవాక్యంలో ఎంత అబద్ధమున్నా దానికివున్న బలం అపారమైంది. నాబోటి సామాన్యుడు ఎదుర్కోదగ్గ సమస్యగా తోచలేదు. ఎదుర్కోవటం ఓటమిని కావలించుకోవడమేననే నిజం నా కళ్ళకు కట్టినట్టవటమే దానికి కారణం.

"నువ్వు నమ్ముతావా?" అన్నాను వాసుతో ఎంతో ప్రయత్నం మీద ఉద్రేకాన్ని ఆపుకుంటూ.

"ఎందుకు నమ్మనూ?"

"అదంతా అబద్ధం రా బాబూ."

"అంతకన్న ఏమంటావులేరా..." అని నవ్వుకుంటూ–

వాసుగాడు వెళ్ళిపొయ్యాడు–వాణ్ని వెళ్ళనిచ్చాను. నాలోని విపరీత ఉద్రేకం తగ్గేదాకా పార్క్‌లోనే కూర్చున్నాను. పైన మంచు పడుతూండటంవల్ల కొంత మంట చల్లారుతుందనే ఆశ. ఆ మంచు ఎక్కువవటంవల్ల నిమోనియా వెంట పడుతుందేమోననే భయం. బుర్ర మొద్దుబారి ఏ విషయాన్నీ అర్థం చేసుకోలేని స్థితివరకూ వొచ్చాకకాని ఇంటికి బయలుదేరలేదు.

నిర్మానుష్యమైన వీధుల్లోపడి నడుస్తున్నాను. చీకటి పడ్డాక ఐదారు గంటలకాలం పార్క్‌లో ఒక్కణ్నీ ఎలా గడపగలిగానో ఆశ్చర్యంగానేవుంది. అప్పుడు తెలియని ఆకలి ఇప్పుడు బాధిస్తూ వుంది. చలికూడా విపరీతంగానే వుంది. ఉద్రేకంలో ఒళ్ళు తెలియక పోవటంలో సంధించినట్టు మగతగా ఉండటంలో ఎన్ని బాధల్ని దూసుకోవొచ్చు!

ఇల్లుజేరి నిద్రపోదామని ఎంతో ప్రయత్నించాను. చల్లని తీయని నీళ్ళు తాగటంవల్ల కొంత శ్రమ తగ్గింది. కాని వాసు గాడు నాకు అంటగట్టిన సమస్య క్షణక్షణమూ తన బరువును పెంచుకుంటూనే వుంది.

'ఊరంతా అల్లుకుంది' అనేమాటను నేను మరిచిపోలేకుండా ఉన్నాను. అసలు మనిషిని నాకు తెలియకుండా ఊరంతా ఎలా తెలిసిందో నాకు అర్థమవటంలేదు. ఎవడో పనిలేనిమంగలి యీ రకం ప్రచారానికి పూనుకొని వుంటాడు.

బైటనుంచి చూసేవాళ్ళు నమ్మే అవకాశాలు చాలా ఉన్నవి. శాంత భర్త గత నాలుగు సంవత్సరాలుగా మిలిటరీలో ఉన్నాడు. ఎప్పుడైనా ఉత్తరం వొస్తేనే తప్ప అతను బతికివున్నట్టు కూడా తెలిసే విధానం ఇంకోటిలేదు. చిన్నతనం నుంచీ ఇరుగుపొరుగుల స్నేహంవల్ల – ఆమె మా ఇంటికి తరుచుగా వొస్తూ పోతూ వుంటుంది.

ఆమెకూ నాకూ చిన్నతనం నుంచీ స్నేహభావం వుంది. ఆ భావాన్ని ఇతర కళంకాలేమీ ఇంతవరకూ తాకలేదు. మరీ నా భార్య కాపరానికి వొచ్చినప్పటినుంచీ ఆమెకూ శాంతకూ మంచి స్నేహం ఏర్పడ్డది. శాంతలాటి యువతి కాలఖర్మవశాత్తు గడపవలసివొచ్చిన ఒంటరిజీవితంలోని బాధను తప్పించుకునేందుకు ఎక్కువకాలాన్ని ఆమె మా ఇంటిపట్టునే గడుపుతూ వుండేది...నాభార్య కాన్పుకని వెళ్ళినప్పటికీ ఆమె అడపాదడపా మా ఇంటికి వొచ్చి నాతో మాట్లాడటము, ఏవన్నా పుస్తకాలడిగి తీసుకువెళ్ళటమూ మానలేదు. మానవలసిన అవసరం ఒకటి వుందనే జ్ఞానం ఆమెకు కానీ నాకు కానీ కలగక ముందే లోకులకు యీ సంఘటనలో ఒక 'వింత' కనిపించినట్టుంది!

జరిగిన జీవితంలోని ఘట్టాలు జ్ఞాపకానికి వొచ్చినవి. శాంత ఎంతో కలిసిపొయ్యే స్వభావంగల పిల్ల. కొంతమందికి ఆడపిల్ల అలా స్వేచ్ఛగా ఉండటం పడకపోతే నేను చెప్పలేను కాని, ఆమె ప్రవర్తన చూస్తే పైవాళ్ళు అనుమానించ దగ్గది ఏమన్నావుందా అని ఆలోచించాను. ఎందుకు అనుమానించ కూడదు? నాకు తెలుసు కనుక నేను అనుమానించలేదు కాని, ఆమె ఇంకోరి ఇంటికివెళ్ళి నా దగ్గరిలానే ఇంకో యువకుడి దగ్గర ప్రవర్తించినట్లయితే నేను కూడా శాంతనూ ఆ యువకుణ్ణీ అనుమానించే వాణ్నేమో?

ఇంతకు పూర్వం నాకు శాంతమీద ఎలాటి అభిప్రాయం ఉండేదో తెలుసుకోవా లనుకున్నాను. సోదరివలె చూసేవాణ్నా? కాదు...అందమైన యువతి వలెనా? ఉహుఁ. పోనీ ప్రియురాలు స్థానేనా? అదీకాదు...అసలు ఏ నిశ్చితాభిప్రాయమూ లేకుండానే ఉండేవాణ్ని. అలాటి నాకూ శాంతకూ యీ 'అపనింద' రావటం భరించలేనంత బాధకు నన్ను గురిచేసింది.

ఇప్పుడిప్పుడు గుర్తొస్తోంది...గత నాలుగైదు నెలల నుంచీ శాంత ప్రవర్తనలో ఒక విశేషం, స్పష్టంగా పురుషత్వం వున్న ఏ మనిషికైనా అర్థమయే విధానం చూడగలిగాను. కాని అది ఆయా సమయాల్లో తెలుసుకోలేక పోయినందుకు కూడా తగినంత కారణం లేకపోలేదు. నా మనసులో శాంత విషయంలో ఏ విధమైన దురభిప్రాయమూ లేకపోవటంవల్ల ఆమె చేష్టల్ని నేను ఇంకో విధంగా అర్థం చేసుకోలేకపొయ్యాను. మా మధ్య ఏళ్ళతరబడిగా పెరుగుతూ వొచ్చిన పరిచయం, స్నేహరూపంలోకి మారటంలో ఏదో విశేషం ఇమిడి వుందనే తలపు రాకుండానే అదేదో సర్వ సాధారణమైనదిగా తోచటంవల్ల నా మనసు అటులాగలేదు. ఇప్పుడు ఆలోచిస్తే స్ఫటికమంత స్పష్టంగా శాంత మనోభావం నన్ను కోరినట్టే అర్థమైంది. అంతకన్న ఆ విధంగా అర్థం చేసుకోవొచ్చనే అభిప్రాయం నాకు కలిగిందని చెప్పగలను. కాని నేనుకూడా మళ్ళీ పొరబడుతున్నానేమో! అనుమానం కలగాలేకాని సంఘటనలోని రంగు ఇట్టే మారుతుంది.

ఏమైనప్పటికీ శాంత నన్ను కోరినా, కోరి ఉండకపోయినా పైవాళ్ళు శాంత ప్రవర్తనను తప్పుగా అర్థం చేసుకొని ఉంటారు. నిజానికి నేను అర్థం చేసుకోవలసింది. నాకన్న ముందుగా ఇతరుల దృష్టిని శాంత తన ప్రవర్తన ద్వారా ఆకర్షించి వుంటుందని మాత్రం చెప్పగలను. పొగకూడా లేకుండానే నిప్పువుందని లోకం అనలేదు కదా!

దీర్ఘాలోచనలో నాకో సత్యం గోచరించింది. నాలో అదివరకులేని ఒక కొత్త భావానికి వాసుగాడు పునాదివేశాడు. ఏ అభిప్రాయములేని శాంత మీద ఇప్పుడొక అభిప్రాయం ఒక రూపాన్ని పొందింది. ఇన్నాళ్ళుగా నేను శాంతలాటి యువతిని అనుభవించకుండానే ఎంతో కాలాన్ని వృథా చేశాననిపించింది. ఆమె నాకెంతో అందుబాటులో వున్నట్టూ, నేను తల ఆడించినంతమాత్రాన నాముందు మోకరిల్లేందుకు సిద్ధంగా వున్నట్టూ, నేనే మూఢుణ్నయి ఆ సదవకాశాన్ని గమనించకుండానే సాగిపోయినట్టూ, యీ అంతరార్థమంతా ఇప్పుడే తెలియటంవల్ల హృదయమంతా విచారంతో నిండి పోవలసి వొచ్చినట్టూ ఫీలవసాగాను.

...కాని శాంత నిజంగానే నన్ను కోరటం లేదేమో? ఇదివరకులానే మా పరిచయాన్ని అడ్డంపెట్టుకొని ఆమె ప్రవర్తనకు యీనాడు వాసుగాడి మాటప్రకారం యీ రంగు వేస్తున్నానేమో? అదే నిజమైతే శాంత పట్ల నేనెంతో అపచారం చేసినవాణ్నవుతాను! అంతేకాదు ఆమె స్త్రీ, వివాహిత. జీవితాంతంవరకూ తన భర్తమీదనే ఆధారపడవలసిన పడుచు. యీ అపనిందవల్ల నాకు కలిగే నష్టమేమీ ఉండదు. కనీసం ఆమె పొందవలసిన అవమానం, చిత్త క్షోభ, సాంఘికపతనం భర్తవల్ల ఉత్తరోత్రా ఆమెపొందే అనాదరణ మొదలైనవాటితో తూచిచూస్తే నాకు తగిలినదెబ్బ లెక్కలోకి రాదు. ఇతర లోకంవలెనే నేనుకూడా శాంతను అనుమానించటంలో పొరబడి ఆమెకు అన్యాయం చేస్తున్నానేమో?

కాని మనస్సు - ఇంతవరకూ యీ మనస్సులో లేని ఒక లక్ష్యం ఏర్పడ్డది. ఒక కోర్కె బలంగా నడిపిస్తూండటంవల్ల తప్పిద్దామన్నా ఆ లక్ష్యం తప్పనిసరి అయేట్టే తోస్తోంది. నాలోని సౌందర్యపిపాస, దుర్బలహృదయం ప్రదర్శించే చంచలత్వం, స్త్రీవ్యామోహం అందువల్ల నేను పొందబొయ్యే సౌఖ్యం నాలో రేపిన ఆశ, వీటితాకిడికి తట్టుకోలేక ఇప్పటికే వృథా చేసుకున్న అవకాశాలకు ఏడవకుండా మొట్టమొదటిగా ఎదువరబొయ్యే అవకాశాన్ని ఉపయోగించుకొని సౌఖ్యపడమని హితబోధతో హెచ్చరించే మనసూ. వివిధ భావాల వొత్తిడి నన్ను కమ్ముకున్నది.

లోకుల సంగతి అవతలవుంచి ఇప్పుడు నేను శాంతతో తన మీద నాకు ప్రేమవుందని చెప్తే ఏమంటుంది? ఒప్పుకుంటుందా? ఒప్పుకు తీరుతుందనే ధైర్యం వుంది. యీ ధైర్యాన్ని యీ లోకులనేవాళ్ళే నాలో ప్రవేశపెట్టారు. నాలో అది ప్రవేశించిన చాలాకాలానికి కాని - అంటే గత సాయింత్రం వాసుగాడు ఊదే వరకూ తెలుసుకోలేకపొయ్యాను.

ఒకవేళ ఆమె నిరాకరిస్తే?...యీ తలపు నాలో కలిగించిన బాధ, మనోవ్యధ ఇంతింతకాదు. అప్పుడిక ఆత్మహత్య ఒక్కటే నాకు శరణ్యం! జీవితంలో శాంత ఒక సమస్య అవుతుందని తెలిస్తే ఎప్పుడో జాగర్తపడేవాణ్ణి. శాంత శీలాన్ని పరీక్షించటంకన్న శాంత దగ్గరి నా ఓటమి నేను జీవితసమస్యగానే తీసుకోవలసి వుంటుంది. ఏమైనా ఇది ఎందుకు అవనేరదో ఒక్కసారి పరీక్షించి చూస్తే ఏమౌతుందో తెలుసుకోవాలనే కుతూహలం నన్ను ఏదారి వెంటనైనా నడిపించగలిగినంత బలంగావుందని మాత్రం చెప్పగలను.

ఆ రాత్రంతా ఇవే ఆలోచనలు. ఏ విధంగా ముందుకు సాగాలోకూడా అర్థం కాకుండా వుంది. యీ ఆలోచనలతో దగ్గర జేరదనుకొన్న నిద్ర నన్నెప్పుడు ఆవరించిందో సరిగ్గా చెప్పలేను.

## 2

మర్నాడు మధ్యాహ్నం యథాప్రకారంగా శాంత మాఇంటికి వొచ్చింది. ఇన్నాళ్ళూ నేను శాంతలో చూడని యవ్వనశోభ, అందం, ముఖంలో మెరిసే జీవకళ, ఆకర్షించగల శరీరసౌష్ఠవం – కవిత్వకన్య రూపాన్ని ధరించిందేమో ననిపించింది. చాలాసేపటినుంచీ నా ఆలోచలన్నీ శాంత మీదనే కేంద్రీకరింపబడి ఉండటంవల్ల శాంతను యీనాడు చూసిన మొదటిచూపే యీ అవతారాన్ని దాల్చి వుంటుందనుకుంటాను.

చప్పున జ్ఞాపకానికి వొచ్చింది – మా ఇద్దరిమీదా పడ్డ బహు జనాభిప్రాయంవల్ల నా మనస్సులో యీ రకం వికారాలు బయలుదేరినవని. ఆమెకు ముందుముందు కలగబొయ్యే కీడుసంగతి కూడా తెలుసుకోకుండా అమాయకంగా మామూలుగానే ఆమె ప్రవర్తించసాగింది. వాసుగాడివల్ల నాకు తెలిసినట్టే ఆమెక్కూడా ఎవరైనా ఆ రహస్యాన్ని వూదినట్టయితే ఆమెకూడా బెదిరివుండేది. కనీసం కొంత జాగర్తపడివుండేది. కనుక ఆమెకు యీ విషయాన్ని నేనే మెల్లిగా చెప్పటమూ, ఇక ముందు తగుజాగర్తను అనుసరించమని బోధించటమూ నాకు విధ్యుక్తధర్మాలు. మరీ గత రాత్రినుంచీ ఆమె మీద నాకు కలిగే భావాల తాకిడిని నేను భరించాలంటే కనీసం ఆ భావాలు కార్యరూపంలోకి మారకుండా వుండేందుకు తగిన కట్టుదిట్టాలు చేసుకోవాలంటే శాంతను దూరంగా ఉంచవలసి వుంటుంది. అది వొకవిధంగా ఇద్దరకూ మేలేకనుక బాధలేదు. ఇక శాంత నన్ను బాగా అర్థం చేసుకోగలదీ, చదువుకున్న తెలివిగల యువతీ కావటం వల్ల విషయమంతా భయపడకుండానే ఆమెకు నచ్చచెప్పవొచ్చు.

"విచారంగా ఉన్నట్టున్నారే!" అంది తాంబూలంతో ఎర్రనయిన పెదవుల్ని కదుపుతూ.

"ఏంలేదు...సరేకాని శాంతా! ఊళ్ళో ఏమనుకుంటున్నారో తెలుసా?"

"నాకెలా తెలుస్తుందీ? నేను ఊరంతా తిరుగుతున్నాను కనుకనా? ఐనా ఏమనుకుంటే నాకేం?"

"వేళాకోళం కాదు శాంతా! నీ విషయం కనుకనే నేను చెపుతున్నాను."

"నా విషయమా?"

"ఔను...ఊళ్ళో అందరూ నీకూ నాకు సంబంధం వుందనుకుంటున్నారు!" అంతకన్న ఎక్కువజాతి పదాలు నాకు దొరకలేదు.

ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబడ్డది. క్షణకాలం కళ్ళు రెండూ మూసుకొని అటు నిలబడ్డదల్లా నావైపుకు తిరిగి, మెల్లిగా కళ్ళు తెరిచి సూటిగా నా ముఖంలోకి చూసి నవ్వింది. ఆమె ఆశ్చర్యపడుతుందని, తనమీదపడ్డ యీ పిడుగుకు కుంగిపోతుందని, కనీసం ఏడుస్తుందని, ఆ లోకుల్ని దుమ్మెత్తి పోస్తుందని అనుకున్నాను. ఒకవేళ ఆమె కింకా నమ్మకం కలగక పైభావాలేవీ ప్రదర్శించలేకపోయిందేమోననే అనుమానం కూడా నాకు కలిగింది.

అన్నాను : "నిజం శాంతా! అందరూ అలాగే అనుకుంటున్నారు."

"పోనీండి" అంది బజార్లో తిరిగే ఒక కుక్క చచ్చిపోయిన వార్తను విని లెక్క చేయనంత తేలిగ్గా!

"అది నువ్వనుకున్నంత చిన్న విషయం కాదు శాంతా! ముందు ముందు ఆలోచించు...యీ అపనింద వల్ల నీ జీవితం ఎంత తారుమారవుతుందో తెలుసా!"

"దానిక్కూడా నేను బాధ్యురాలినా? యీ లోకుల్ని లెక్క చేసేదేమిటి?"

"వాళ్ళను లెక్క చెయ్యమని కాదు కాని, అబద్ధమైనా పనిగట్టుకొని అదేపనిగా వాగుతూవుంటే అదే నిజమనే రూపాన్ని పొందుతుందని తెలుసా?"

"తెలుసనుకోండి. ఏం చేస్తాం? ఇప్పుడు నన్ను వాళ్ళందరి దగ్గరకూ వెళ్ళి వాళ్ళనుకునే సంబంధం మనిద్దరిమధ్యా లేదని చెప్పమంటారా? పోనీ ఆ విధంగా ప్రతి ఒక్కరితోనూ చెప్పినా యీ అపనింద తొలగిపోతుందనే ధైర్యం మీకు వుందా?"

ఆ ధైర్యం నాకేమీ లేదు. నిన్న సాయింత్రం ప్రాణస్నేహితుడైన వాసుగాడి దగ్గర అదంతా అబద్ధమని చెప్తే వాడు నమ్మాడా? నమ్మటం లేదని చెప్పటమేకాక, నా తెలివి తక్కువకు, తనను మోసంచేసేందుకు నేను ప్రయత్నించానన్నట్టూ తను ఆ మోసాన్ని గుర్తించ గలిగిన తెలివికి నా మొహంలో నవ్వి ఊరుకున్నాడు. వాసుగాడే ఇలాచేస్తే ఇక మిగతా వాళ్ళ సంగతి నేను తేలిగ్గా ఊహించగలను.

"అది కాదు శాంతా! నేను ఎవరితోనూ ఏమీ చెప్పమని అనలేదు. మనకు తెలియకుండానే మన వెనుక ఏదో జరుగుతోందని ఆలోచించు. యీ అబద్ధ ప్రచారానికి విరుగుడు ఏదన్నా ఆలోచించాలి కదా! ఏం చేద్దాం?"

ఆమె "ఏమీలేదు...యీసారి ఎవరన్నా మిమ్ము అడుగుతే అంతా నిజమేనని చెప్పండి!" అంది నవ్వుతూ.

శాంత చూపిన చిలిపితనాన్ని నేను ఇంకే సందర్భంలోనైనా ఆనందించి ఉండేవాణ్ని కాని, ఇప్పుడు ఒక పక్క ఛస్తూవుంటే యీ హాస్యం నాకు విషమించిందనే చెప్పాలి.

"నీ ఉద్దేశమేమిటి శాంతా! నిజమని ఒప్పుకోమంటావా? అబద్ధాన్ని నిజమని ఒప్పుకుంటే ఏమౌతుందో తెలుసా?" అన్నాను కఠోరంగా.

"ఏమౌతుందో నాకు తెలుసు. మీకు తెలియదు. అందుకనే మీకు కోపం వచ్చింది. ఏమతుందో నేను చెప్తాను వినండి. ఆ విషయం అబద్ధం అని కనుక మీరు అంటే దాన్ని రుజువు చేసేందుకు, ఒక విధంగా మిమ్ము ఏడిపించేందుకు ప్రతివాడూ, యీవున్న కట్టుకథకు తోడుగా మరి కొన్ని కథలు చిలవలు పలవలుగా ప్రచారంలోకి తెస్తాడు. కాని నిజమేనని కనుక మీరు అంటే ఎదుటి వాడినోటికి తాళం పడ్డట్టే! ఆ తరువాత వాడికి అడగాల్సిన ప్రశ్న లేదు. మీరు ఒప్పుకోకపోతే వాడికి పేచీకాని ఒప్పుకుంటే ఏముంది? ఆ విధంగా అది గొప్ప సత్యంగా నిత్యజీవితంలో ఐక్యమైపోతుంది. ఇకముందు దాన్నిగూర్చి ఎవ్వరూ అనుకోరు యెందుకంటే అందరికీ తెలిసిందేగా అది నిజమని. కనుక నిజమనే పోజ్ కనుక వేస్తే యీ సమస్య పరిష్కరించబడుతుంది."

నాకు అర్థమైంది; శాంత చాలారోజులుగా దీన్ని గూర్చి ఆలోచించి వుంటుందని. ఎంత తెలివిగా చెప్పింది! కాని ఇందులో ఇంకొక్క ఇబ్బందికూడా లేకపోలేదు.

"సరే ఒప్పుకుంటాననుకో. యీ గోలంతా తగ్గిపోతుంది. అబద్ధమే అయినా దాన్నే అనుసరించటంవల్ల యీ సమస్య తేలుతుంది...కాని నిజాన్ని తోసెయ్యటం ఎలా?"

"నిజాన్ని తోసెయ్యటం!" అని నవ్వి అంది. "అబద్ధాన్ని నిజంగా ఒప్పుకోవడమైనా, దాన్ని నిజం చేసి నిజంగానే ఒప్పుకోవటమైనా ఒకటేగా!"

"అంటే?"

"అంటే...అంటే ..." అని కొంటెగా నవ్వుతూ అంది. "ఒక అపనింద బయలుదేరింది. కావలసినంత వరకూ అది పారింది. మనం నిజంగా అనుభవించకపోయినా, దానికి అనుభవించి నప్పుడు కలగవలసిన అలజడి రానే వొచ్చింది. ఇక ఆ అనుభవం నిజమైతే మాత్రమేం? దాని వెల ఇదివరకే ఇచ్చుకున్నాంకదా! అప్పుడు ఇంతకన్నా భయంకరమైన పరిస్థితి ఏ విధంగానూ ఏర్పడదుగా!"

"అంటే అపనింద నిజం చేయమంటావా?"

"నేను అనటం దేనికి? చేసినందువల్ల కలిగే కొత్తమార్పు ఏముంది గనుక? మీరు ఆ మాత్రం ఆలోచించరాయేం?"

శాంత నా లక్ష సమస్యల్ని తీర్చింది. ఇక భయపడవలసిందేమిటో నాకు తెలియటంలేదు. శాంతను నా దాన్నిగా చేసుకోవటంలో నా ప్రస్తుత బాధలన్నీ వొదిలిపోతవి. ఆ మాట ఆమె నోటి వెంటనే రావటం నా అదృష్టాల్లోవొకటి. నాకు అర్థంకాని దానికోసం ఇన్నాళ్ళూ వెతలుపడే మనస్సుకు నిజంగా నాకేం లోపమో ఆమె నిర్ధారణ చేసి చెప్పగలిగింది!

శాంత వెళ్ళబోతోంది. జడపట్టుకొని లాగాను. వెనక్కు తిరిగి 'ఏమిటి?' అన్నట్టు కనుబొమలు చిట్లించి తమాషాగా చూసింది.

"వ్రతం చెడ్డా ఫలమన్నా దక్కాలిగా మరి?" అన్నాను.

"ఐతే?"

"ఐతే తమరు లోపలికివొచ్చి తలుపు గడియవేయమంటాను."

"ఇంకా నయం! పట్టపగలా? భలేవారు-"

"ఇంతకన్న చెడేదేమిటి-నువ్వు చెప్పిందేగా॥

"చెప్తే?" అని రహస్యంగా "రాత్రికి" అని చెవిలో వూది పరుగెత్తింది.

ఇక ఆ రాత్రికోసం కాపలా వేసుకొని కూర్చున్నాను. శాంతకూ నాకూ కూడా ఒక జీవిత సమస్య ఆ రాత్రి పరిష్కరించబడ్డది. నేను అనుకోని విధంగా ఒకేఒక్క మాటమీద సంభవించిన ప్రమాదం మా ఇద్దర్నీ ఒకే మెట్టుమీదికి తోసేసింది.

"శాంతా! నాకన్న నువ్వెంతో తెలివిగలదానివి. ఉన్న పరిస్థితిని ఎంతబాగా ఉపయోగించుకోవొచ్చో చక్కగా తెలుసుకున్నావ్."

"మీరు తెలుసుకోనట్టు?" అంది.

"నాకు నిన్న సాయింకాలమేగా తెలిసింది! నీకు అంతకు ముందే తెలిసివుండాలి. ఔనా?"

"ఔను...ఐతే?"

"మరి నాతో ఎందుకనలేదు? కనీసం సూచనగా నన్నా-?"

"ఏం సూచన! ఆడది నోరువిప్పి ఏమీ అడగదని మీకు తెలియక్కర్లా?"

"నిన్ను అడగమనటంలేదు ... యీ అపనింద సంగతి ఇదివరకే నాకు చెప్పకపొయ్యావా అంటున్నాను. నిన్న సాయింత్రం వాసుగాడు అనేదాకా నాకు తెలియదు. వాడికీ ఇతర జనాభిప్రాయాలకూ నా ధన్యవాదాలు. యీ అపనింద రాకపోయినట్టయితే మనిద్దరం యీ విధంగా కలుసుకునే వాళ్ళమేనా?"

"అబ్బ! లోకానికంతకూ ధన్యవాదాలివ్వండి - అసలు వ్యక్తికి తప్ప-"

"అసలు వ్యక్తివి నువ్వా?"

"నేనే!"

"నీక్కూడా–"

'ఆగండి. మీకేం అర్థమైందనీ? ఎన్నాళ్ళనుంచీ నేను మీకోసం ఎత్తులు వేశాను? ఒక్కనాడన్నా నన్ను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారూ? అంతా మొండితనం! వేషం."

"నిజంగా నేనాదృష్టితో చూడలేదు శాంతా!"

"చూడాలని లేదు."

"వుందోలేదో, నా కింకాస్త అర్థమయేట్టు చేసినా బాగుండేది."

"అంటే ప్రణయలేఖ రాయాల్సింది! అందుకనే ఆ తోవ పట్టించాను."

"ఏమిటది?"

"యీ అపనింద ఎక్కడ బయలుదేరిందనుకున్నారు? నాలోనుంచే బయలుదేరి మీదాకా వొచ్చేందుకు మూడు నెలలు పట్టింది. ఇప్పటిక్కాని మీకు ఆ వేడి తగలలేదు!

"ఎంతశ్రమపడ్డాను! వాసు పెళ్ళాంముందర మీ గూర్చి ఎంతపొగిడాను! ఆమె మెల్లిగా వాసన పట్టేట్టు చేసేందుకు ఎన్నిప్లేట్లు మార్చాను! చివరకు 'ఏమిటీ' అంటే 'నాకూ ఆయనకూ సంబంధం వుందని ఊరంతా తెలిసిన విషయమేగా' అనికూడా అనాల్సి వొచ్చింది. ఇంత శ్రమ నేను పడితే లోకులకు మీరు ధన్యవాదాలిచ్చి పూలదండలు వేస్తారు–ఔనా?" చిలిపిగా నవ్వుతోంది!

"ఐతే ఊరంతా నువ్వే టమటమా వేశావన్నమాట?" అన్నాను.

"ఊరంతా వేయటం నావొంతు కాదు. ఒక్క వాసుకు తెలుస్తే సరిపోతుందని ఊరుకున్నాను. మిగతా పని కావాలంటే మీరే పూర్తి చేసుకోండి."

నాకు ఆశ్చర్యమే అయింది. శాంతలాంటి తెలివిగలది ఏ దేవతల కారుణ్యంవల్లనో నాచేతుల్లోకి వొచ్చిందనిపించింది. ఏ విధంగా శాంతకు నా కృతజ్ఞతను తెలపాలో అర్థంకాలేదు.

"ఏ వినాయక చవితినాడో నెలవంకను చూసిన పాపానికి యీ అపనింద నా మెడకు చుట్టుకుంది. ఐనా నాకు విచారం లేదు...ఎందుకంటే చంద్రబింబమే నాకు దక్కింది" అన్నాను.

"అదా? కాని మీరొక్కటి మరిచిపొయ్యారు. తెల్లారిపోతే యీ చంద్రబింబం కనిపించదుగా!"

ఆమె హెచ్చరికను నేను వెంటనే గమనించాను!

– *ఫిబ్రవరి, 1948*